సాక్షి తిరుపతి


శుక్రవారం । 12 । జనవరి । 2024



అర్హులందరికీ జగనన్న తోడుగా..

అర్హులందరికీ జగనన్నతోడు పథకాన్ని అందజేస్తున్నట్లు కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తెలిపారు.

- 8లో



ఆధ్యాత్మికనగరిలో హాకీ పండుగ

ఎస్వీయూ మైదానంలో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు గురువావరం వేడుకగా ప్రారంభమయ్యాయి.

- 8లో



చిరకాల స్వప్నం సాకారం

పేదల చిరకాల స్వప్నమైన ఇళ్లస్థలాలు, ఇళ్లపై హక్కుపొందడం నేడు సాకారమైందని డిప్యూటీ మేయర్ అభినయ్ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

'అచ్యుతం, శ్రీపాదం' పనుల పరిశీలన



వసతి గృహాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి(అలిపిరి): శ్రీగోవిందరాజస్వామి సత్రాల స్థానంలో నూతనంగా నిర్మిస్తున్న అచ్యుతం, శ్రీ పాదం వసతిగృహాల నిర్మాణ పనులను గురువారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పరిశీలించారు. త్వరలోనే భక్తులకు సౌకర్యవంతంగా వసతి గృహాల నిర్మాణ పనులు పూర్తి కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎస్కే బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

శ్రీవారికి వెండి గంగాళం విరాళం



శ్రీవారికి విరాళంగా అందించిన వెండి గంగాళం

తిరుమల: శ్రీవారికి కదిరి నియోజకవర్గం కనసాని వారిపల్లెకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంజీ రెడ్డి రూ.6 లక్షల విలువైన 6.7 కిలోల వెండి గంగాళాన్ని గురువారం విరాళంగా అందజేశారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి దర్శనానికి వెళ్లిన ఆయన సదరు గంగాళాన్ని శ్రీవారి అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల దాత మాట్లాడుతూ శ్రీవారిపై ఉన్న భక్తితో ఆయన సేవలకు ఉపయోగపడేలా వెండి గంగాళాన్ని అందించామని తెలిపారు. గతంలో శ్రీవారికి రూ.5.3 లక్షల విలువైన వెండి శంఖు, చక్రాలు, నామాలను అందించినట్టు గుర్తు చేశారు. ఆయన వెంట కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్ధారెడ్డి, సోమశేఖర్‌డ్డి, వినోద్, సమరసింహారెడ్డి ఉన్నారు.

13న తుమ్మలగుంటలో ముగ్గుల పోటీలు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ నెల 13వ తేదీన మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు తుమ్మలగుంట సర్పంచ్ నల్లందుల సుబ్బారామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆలయం ఎదుట ముగ్గుల పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నామన్నారు. విజేతలకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, లక్ష్మి దంపతుల చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేయనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

28న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

తిరుపతి కల్చరల్: నగరంలోని వినాయక నగర్ ఎదురుగా ఉన్న కంచి పాదుకా మండపంలో ఈనెల 28వ తేదీన బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహించన్నట్లు నిర్వాహకుడు సీఆర్‌కే శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత బ్రాహ్మణ కల్యాణోపాధ్యాయ వివాహ సమాచార కేంద్రాల సంఘం, తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం వృద్ధ బ్రాహ్మణ దంపతులకు సామూహిక షష్టిపూర్తి మహోత్సవం, అనంతరం సహస్ర చంద్ర దర్శనం, శాంతి హోమం చేస్తామన్నారు. కార్యక్రమానికి బ్రాహ్మణ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

అద్వితీయం

ఆధ్యాత్మిక తిరునగరి మళ్లీ మెరిసింది. పరిశుభ్రత పరిమళాలను ప్రజలందరికీ పంచి..తాను అత్యంత ఎత్తైన స్థానంలో నిలబడింది. హేమాహేమీలైన చారిత్రక నగరాలతో కుస్తీ పట్టి.. ఎన్నో రాష్ట్రాల రాజధానులను సైతం వెనక్కి నెట్టి.. పలు అంశాల్లో ఆటుపోట్లను ఎదుర్కొని.. ఉత్తుంగ తరంగమై ఎగిసింది. అరుదైన గౌరవం దక్కించుకుంది. ఏడోసారి సత్తా చాటి, జాతీయస్థాయిలో అ'ద్వితీయం'గా నిలిచింది. ఢిల్లీలో గురువారం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో తిరుపతి అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలబడి, అరుదైన గౌరవం దక్కించుకుంది.

- ఆధ్యాత్మిక నగరానికి అరుదైన గౌరవం
- స్వచ్ఛతలో తిరుపతికి పెరిగిన పరపతి
- జాతీయస్థాయిలో ద్వితీయ ర్యాంక్
- స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పోటీల్లో సత్తా
- ఢిల్లీ వేదికగా మెరిసిన తిరునగరి ప్రతిష్ట
- అవార్డు అందుకున్న మంత్రి ఆదిమూలపు సురేష్, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ



తిరుపతి నగరం

ర్యాంకులు ఇలా..

సంవత్సరం	ర్యాంకు
2017	9
2018	6
2019	8
2020	6
2021	3
2022	1
2023	2



స్వచ్ఛ అవార్డును అందుకుంటున్న రాష్ట్ర మంత్రి, మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్

తిరుపతితుడా: స్వచ్ఛసర్వేక్షణ్ పోటీల్లో తిరుపతి ఈ ఏడాది ద్వితీయస్థానం సాధించింది. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛసర్వేక్షణ్ పోటీలను నిర్వహిస్తోంది. 2016లో స్వచ్ఛభారత్ మిషన్ ఏర్పాటు చేసిన కేంద్రం.. దేశంలోని నగర ప్రజలకు మెరుగైన సేవలు, పరిశుభ్రతను అందించడమే లక్ష్యంగా 2017 నుంచి స్వచ్ఛసర్వేక్షణ్ పేరుతో జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. అప్పటి నుంచి తిరుపతి నగరం దేశంలోని ప్రముఖ నగరాలతో పోటీపడుతూ జాతీయ స్థాయిలో స్వచ్ఛతలో సత్తా చాటుతోంది. ప్రముఖ నగరాలకు సవాల్ విసురుతూ ఏటా తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటోంది. గత ఏడాది ఫస్ట్ ర్యాంక్‌తోపాటు రాష్ట్రపతి చేతుల మీదు గా ప్రతిష్టాత్మక స్వచ్ఛ సిటీ ప్రెసిడెంట్ అవార్డు అందుకుంది. రాష్ట్రంలోనే ఈ అవార్డును అందుకున్న తొలి నగరంగా తిరుపతి కీర్తి గడించింది.

ఢిల్లీ వేదికగా..

స్వచ్ఛభారత్ మిషన్, కేంద్ర హౌసింగ్ అర్బన్ ఎఫైర్స్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్-23 స్వచ్ఛఅవార్డులను గురువారం ఢిల్లీలో ప్రదానం చేశారు. స్వచ్ఛపోటీల్లో ప్రతిభ కనబరిచిన తిరుపతి అత్యుత్తమ ఫలితాలను దక్కించుకుని జాతీయ స్థా యిలో రెండో ర్యాంక్‌తో మరోసారి మెరిసింది. స్వ చ్ఛ సర్వేక్షణ్ ఓవరాల్, వాటర్ ప్లస్ రేటింగ్ అంశాల్లోనూ తిరుపతి దేశంలోని మహానగరాలకు గట్టి పోటీనిచ్చి అత్యుత్తమ ర్యాంకులను సొంతం చేసుకుంది. స్వచ్ఛ అవార్డును కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ మంత్రి హరిదీప్ సింగ్ పూరి చేతుల మీదుగా రాష్ట్ర మంత్రి ఆదిమూలం, తిరుపతి మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, డీఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డును అందుకున్నారు.

అవార్డులను కుదించి..

స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ఓవరాల్ స్వచ్ఛ సర్వేక్షణ్, వాటర్ ప్లస్, ఓడీఎఫ్ ప్లస్, గార్బేజ్ ఫ్రీ సిటీ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో జాతీయ, జోనల్, రాష్ట్రస్థాయి అవార్డులను ఇచ్చేవారు. అయితే ఈసారి కేవలం ఓవరాల్ స్వచ్ఛ సర్వేక్షణ్ విభాగంలో మాత్రమే అవార్డులను అందజేశారు. లక్ష నుంచి 10 లక్షలు, 10 లక్షలపైన జనాభా కలిగిన (ఓవరాల్) నగరాలుగా విభజించి ఈ అవార్డులను అందజేశారు. తిరుపతి నగరం స్వచ్ఛ సర్వేక్షణ్‌తోపాటు వాటర్ ప్లస్, ఓడీఎఫ్ ప్లస్ విభాగాల్లోనూ పోటీపడినా సంబంధిత అవార్డులు ప్రకటించకపోవడంతో నిరాశగా వెనుతిరగాల్సిన పరిస్థితి ఎదురైంది. 10 లక్షల లోపు జనాభా కలిగిన నగరాల్లో ద్వితీయ స్థానం, ఓవరాల్ స్వచ్ఛ అవార్డుల్లో 8వ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. అవార్డులను కుదించడంతో కేవలం ఒక అవార్డుతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

ఈ ఘనత నగర ప్రజలదే



తిరుపతి జాతీయ స్థాయిలో సత్తా చాటడం సంతోషంగా ఉంది. స్వచ్ఛ పోటీల్లో తిరుపతికి దక్కిన ఈ గౌరవం నగర ప్రజలకు అంకితం. గత నాలుగేళ్లలో మెరుగైన ఫలితాలు సాధించడం ఆనందంగా ఉంది. ప్రజల కు మెరుగైన సౌకర్యాల కల్పనకు రాజీలేని నిర్ణయాలు తీసుకోవడంతో ఈ ఘనత సాధ్యమైంది. అధికారులు, కార్మికులకు అభినందనలు. –భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే

సంతోషంగా ఉంది



స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో తిరుపతి జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్ సాధించడం చాలా సంతోషంగా ఉంది. పుర సేవలు, వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు చర్యలు తీసుకున్నాం. పరిశుభ్రత, కార్మికుల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నాం. – డాక్టర్ శిరీష, నగర మేయర్

మెరుగ్గా పారిశుద్ధ్యం



స్వచ్ఛ సేవలు మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాం. పారిశుద్ధ్యంలో తిరుపతితో ఏ నగరం పోటీ పడనంత స్థాయికి తీసుకెళ్లాలన్నదే లక్ష్యం. రెండు సార్లు స్వీపింగ్, చెత్త సేకరణ, రోడ్లపై నిత్యం స్వీపింగ్, ఎక్కడా చెత్త కనిపించకుండా చేయాలన్న సంకల్పంతో ఉన్నాం. నగర అభివృద్ధి, మెరుగైన పారిశుద్ధ్యం అమలు రెండు కళ్లతో సమానం. భవిష్యత్‌లో ఊహించనంత స్థాయిలో పారిశుద్ధ్యం అమలు ఉండబోతోంది. – భూమన అభినయ్, డిప్యూటీ మేయర్, తిరుపతి

రాజీ లేని నిర్ణయాలు



క్లీన్ తిరుపతి కోసం రాజీలేని నిర్ణయాలు తీసుకుంటున్నాం. పారిశుద్ధ్య నిర్వహణకు పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. ఏటా సుమారు రూ.50 కోట్ల మేర క్లీన్ తిరుపతి కోసం ఖర్చు చేస్తున్నాం. నగర పరిశుభ్రత, చెత్త సేకరణ, చెత్త నిర్వహణను మరింత పటిష్టంగా నిర్వహిస్తాం. – డి.హరిత, కమిషనర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

సమన్వయం..సర్వత్రా హర్షం

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి పార్లమెంట్‌తో పాటు, సత్యవేడు, గూడూరు, చిత్తూరు, పూతలపట్టు అసెంబ్లీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అధిష్టానం సమన్వయకర్తలను నియమించింది. తిరుపతి ఎంపీ గురుమూర్తిని సత్యవేడు అసెంబ్లీ సమన్వయకర్తగా నియమించింది. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను తిరుపతి పార్లమెంట్‌కి సమన్వయకర్తగా అధిష్టానం కేటాయించింది. ఎమ్మెల్సీ మేరిగ మురళిని గూడూరు అసెంబ్లీకి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డిని చిత్తూరు అసెంబ్లీకి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరేవుల సునీల్‌కుమార్‌ని పూతలపట్టు అసెంబ్లీకి సమన్వయకర్తలుగా నియమించినట్లు ప్రకటించింది. వీరి నియామకంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త - కోనేటి ఆదిమూలం



జననం: 7, ఏప్రిల్, 1952

తల్లిదండ్రులు : కాంతమ్మ, కోనేటి ఏలుమలై

స్వగ్రామం:భీమునిచెరువు,నారాయణవనం మండలం

కుమారుడు: కోనేటి సుమన్‌కుమార్

కుమార్తెలు: స్వప్న, శ్రావణి, శోభ

చదువు: బీఏ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి

రాజకీయ అరంగేట్రం:1976 కాంగ్రెస్ పార్టీలో చేరిక

- 1975 అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు, పుత్తూరు
- 1979 పుత్తూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్
- 1981 సర్పంచ్, భీమునిచెరువు
- 1987 మండల పరిషత్ వైస్ ఎంపీపీ
- 1989 కాంగ్రెస్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి
- 1992: జిల్లా ఖాదీ బోర్డు డైరెక్టర్
- 1994 ఎంపీటీసీ సభ్యుడు భీమునిచెరువు
- 2001 జెడ్పీటీసీ సభ్యుడు, నారాయణవనం
- 2014: సత్యవేడు ఎమ్మెల్యేగా ఓటమి
- 2019: సత్యవేడు ఎమ్మెల్యేగా 44,786 ఓట్ల మెజార్టీతో గెలుపు

సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త : మద్దిల గురుమూర్తి



ఊరు: మన్నసముద్రం, శ్రీకాళహస్తి నియోజకవర్గం

తల్లిదండ్రులు: రమణమ్మ, మునికృష్ణయ్య

కుటుంబం: భార్య, కొడుకు, ఐదుగురు అక్కాచెల్లెళ్లు

విద్యాభ్యాసం: మన్నసముద్రంలో ఐదు వరకు, 6 నుంచి 10 వరకు బందారుపల్లి, ఇంటర్ తిరుపతి, స్విమ్స్‌లో ఫిజియోథెరపీ

ఎంపీగా తీసుకొచ్చిన ప్రాజెక్టులు

- ఇంటర్నేషనల్ మోడల్ బస్టాండ్ నిర్మాణానికి రూ.400 కోట్లు
- ప్రపంచస్థాయి రైల్వేస్టేషన్ నిర్మాణానికి రూ.400 కోట్లు
- నైలెట్ కేంద్రానికి రూ.8.50 కోట్లు
- అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధికి ప్రత్యేక ప్రాజెక్టు (టెండర్ దశ వరకు తీసుకొచ్చారు)
- వెంకటగిరి టౌన్‌లో లైటింగ్ కోసం రూ.కోటి, వెంకటగిరి- ఏర్పేడుకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు (టెండర్ దశకు తీసుకొచ్చారు)
- శ్రీపద్మావతి యూనివర్సిటీలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు
- సత్యవేడు నియోజకవర్గం చిన్నపాండూరు రోడ్డు నిర్మాణానికి రూ.55 లక్షలు
- తిరుపతి బస్టాండ్ ఎదురుగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.80 లక్షలు
- హీరో హోండా షోరూం, సీఆర్ఎస్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు

చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త : ఎంసీ విజయానందరెడ్డి



పుట్టిన తేది: 24-07-1969

తల్లిదండ్రులు: పద్మజ్యోతి, చిన్నబ్బరెడ్డి

భార్యపేరు : ఇందుమతి

కుమారుడు : నిఖిలానందరెడ్డి

పుట్టిన గ్రామం:ఎస్ఆర్‌పురం మండలం, కొటార్లపల్లి

ప్రస్తుతం ఉన్న ప్రాంతం -చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లి

చేపట్టిన పదవులు:2011 నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు

- తర్వాత పార్టీ రాష్ట్ర, జిల్లాస్థాయి బాధ్యతల నిర్వహణ
- ప్రస్తుతం ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు

సేవా కార్యక్రమాలు

- మార్కెట్ గేట్‌కు ఏటా రూ.కోటి వరకు కేటాయింపు
- ఆస్పత్రిలో పార్కింగ్‌కు ప్రతి ఏటా రూ.5 లక్షల మేర చెల్లింపు
- ముస్లిం కుటుంబాలకు రంజాన్‌తోఫా, వివిధ వర్గాలు, ఉద్యోగులకు కానుకలు
- నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కల్పనపై దృష్టి
- కొటార్లపల్లెలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు
- విపత్తుల సమయంలో బాధితులకు దుస్తులతో పాటు నిత్యావసర సరుకులు
- ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు ఆర్థికసాయం
- తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో సొంత నిధులతో వాటర్‌ప్లాంట్ నిర్మాణం
- చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ

పూతలపట్టు సమన్వయకర్త ముత్తిరేవుల సునీల్‌కుమార్



- పుట్టిన తేదీ : 01-09-1969
- స్వగ్రామం: పైపల్లె, ఐరాల మండలం
- ఎడ్యుకేషన్ : ఎంబీబీఎస్, డీఎల్ఓ
- వృత్తి : డాక్టర్
- పొలిటికల్‌గా: మాజీ ఎమ్మెల్యే (2014-2019 వైఎస్సార్‌సీపీ)
- తండ్రి : రఘునాథయ్య
- భార్య : మమతారాణి
- పిల్లలు: కూతురు, కుమారుడు

గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్



విద్యార్హతలు: ఎంఏ హిస్టరీ

తండ్రి: ఎం.ఆనందరావు

తల్లి: సుందరమ్మ

భార్య: జ్యోతి

కుమారులు: డాక్టర్ రేవంత్, హేమంత్ కళ్యాణ్

చేపట్టిన పదవులు :

- రాపూరు డిగ్రీ కళాశాలలో 1988లో జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో చైర్మన్‌గా గెలుపు
- 1995లో రాపూరు జెడ్పీటీసీ
- 2013-15 వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు
- 2016-19 గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త
- తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులుగా నియామకం
- 2022లో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్
- 2023లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవం
- 2023 అక్టోబర్ 4న రాష్ట్ర ప్రభుత్వం విప్‌గా..

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి

తిరుపతి అర్బన్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. గురువారం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వర్చువల్ విధానంలో ఎన్నిక లు, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జ గనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ పథకం, మహిళా శిశు సంక్షేమశాఖ, ఫేజ్ -3 రీ సర్వే, ఇనామ్, అసైన్డ్ భూ ములు, హౌసింగ్ తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ శుభం బన్సల్, జిల్లా వివరాలను తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసరావు, భవానీ శంకర్, జిల్లా వైద్యా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శంకర్ నారాయణ, జిల్లా హౌసింగ్ అ ధికారి వెంకటేశ్వర్లు, సర్వే ఏడీ జయరాజ్, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ శివకుమార్, జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ ఆఫీ సర్ తేజస్విని, అధికారి భారతి పాల్గొన్నారు.

అమ్మవారికి పట్టు చీరల బహూకరణ

తిరుచానూరు(చంద్రగిరి): శ్రీపద్మావతి అమ్మవారికి ఓ భక్తుడు పట్టు చీరలను బహూకరించాడు. గురువారం చీరలను ఆలయాధికారులకు అందజేశారు. ధర్మవరం పట్టణానికి చెందిన పట్టు చీరల వ్యాపారి బేరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలసి గురువారం ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.70 వేల విలువ చేసే రెండు పట్టు చీరలను ఆలయాధికారులకు అందజేశారు. దాతలకు ఆలయాధికా రులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


రూ.300 కోట్లతో రైల్వేస్టేషన్ అభివృద్ధి



రైల్వే వార్షికోత్సవాల్లో ఉద్యోగులతో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ

తిరుపతి (అలిపిరి): నగరంలోని రైల్వేస్టేషన్‌లో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, త్వరలోనే అతి సుందరంగా, మెరుగైన సౌకర్యాలతో చూడనున్నామని తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌లో 133వ వార్షికోత్సవాలను ఆయన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ మీటర్-గేజ్ స్టేషన్‌గా, రెండు లైన్లతో ప్రారంభమైన స్టేషన్ నేడు యాత్రికుల సందడి పెరుగుతూ ఉండడంతో 6 ప్లాట్ ఫామ్‌లతో 80 వేల మంది ప్రయాణికుల రాకపోకలకు సౌకర్యంగా ఉందని తెలిపారు. తిరుపతి స్టేషన్ పర్యావరణంలో గోల్డ్ రేటింగ్ సాధించినందుకు గర్వంగా ఉందన్నారు. అనంతరం విశ్రాంతి ఉద్యోగులను స్టేషన్ డైరెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతి రైల్వే ఉద్యో గులు, విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు



విశేషాలంకరణలో గురుదక్షిణామూర్తి



పురవీధుల్లో ఊరేగుతున్న గొబ్బెమ్మ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో కేఎస్ రామారావు, సభ్యులు పాల్గొన్నారు.

గొబ్బెమ్మకు పురవీధి ఉత్సవం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని వేడుకగా గొబ్బెమ్మ ఉత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయ అలంకార మండపంలో గొబ్బెమ్మ ఉత్సవమూర్తికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ గొబ్బెమ్మను పురవీధుల్లో ఊరేగించారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమలలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సినీ డైరెక్టర్ చోటా కె నాయుడు

తిరుమల: శ్రీవారిని గురువారం సినీ డైరెక్టర్ చోటా కె నాయుడు, ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు ఇచ్చి, సత్కరించారు.

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో చంద్రగిరిలో జనవరి 17వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ పి.సురేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19–45 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగ స్త్రీ,పురుషులు శిక్షణకు అర్హులన్నారు. కనీసం పదో తరగతి పూర్తి చేసి ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇస్తామని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆసక్తిగల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, నాలుగు పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థలో పేరు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి, 79896 80587, 94949 51289 63017 17672 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పంట పొలాలపై గజ దాడులు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలోని దిగవూరు, ఎగవూరు, నెల్లుట్లవారిపల్లె పంచాయతీ పరిధిలోని పంట పొలాలపై బుధవారం రాత్రి, గురువారం తెల్లవారు జామున ఏనుగులు దాడులు చేశాయి. మట్లివారిపల్లెకు చెందిన లక్ష్మీదేవి అరటి తోటలు ధ్వంసం చేశాయి. ఎకరా విస్తీర్ణంలో పంట నష్టం జరిగింది. అలాగే గుంతాటివారిపల్లెకు చెందిన శాంతమ్మ పొలం కంచె విరిచి, మామిడి, పశువుల గడ్డి, టెంకాయ చెట్లు, పైపులను నాశనం చేశాయి. గురువారం భాకరాపేట అటవీ అధికారులు పొలాలను సందర్శించి, పంట నష్టాన్ని పరిశీలించారు. భాకరాపేట, పులిచెర్ల అటవీ అధికారులు ఏనుగుల గుంపును అడవుల వైపు తరిమేశారు.

అర్హులందరికీ 'జగనన్న తోడు'గా..



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

- ఎనిమిదో విడతలో 16,541 మందికి లబ్ధి
- రూ.18.21 కోట్ల రుణాల పంపిణీ
- కలెక్టరేట్‌లో జిల్లా కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

తిరుపతి అర్బన్: ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందజేస్తున్నట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జగనన్న తోడు జిల్లా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లె నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో కలిసి ఎనిమిదో విడత జగనన్నతోడు రుణాలకు సంబంధించిన రూ.18.21 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరి సిఫార్సు అవసరం లేదని, అర్హతే ప్రామాణికంగా తీసుకుని అందరికీ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికీ అర్హత ఉండి ఎవరికైనా రాకుంటే వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పథకాన్ని వర్తింప చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. చిరు వ్యాపారుల ఆర్థిక స్వావలంబన కోసం, నడ్డి విరిచే వడ్డీలకు చెల్లుచీటీ చెబుతూ చిరు వ్యాపారులకు అండగా నిలవాలన్న సదుద్దేశంతో వరుసగా నాలుగో ఏడాది ఎనిమిదో విడత జగనన్న తోడు వడ్డీ రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా చిరు వ్యాపారులకు రూ.10 వేల వరకు వడ్డీలేని రుణం కల్పిస్తూ, పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికి రూ.10 వేలు అంతకు పైగా రుణాలను అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో ఫుట్‌పాత్‌లపై, వీధుల్లో తోపుడు బండ్లపై వస్తువులు, కూరగాయలు, పండ్లు అమ్ముకుని జీవించేవారు, రోడ్ల పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించేవారు, గంపలు, బుట్టల్లో వస్తువులు అమ్మేవారు, సైకిల్, మోటారు సైకిల్, ఆటోలపై వెళ్లి వ్యాపారం చేసేవారితో పాటు, సంప్రదాయ చేతివృత్తుల కళాకారులు, ఇత్తడి పని చేసేవారు, బొబ్బిలి వీణ, లేస్ వర్క్స్, కలంకారీ, తోలుబొమ్మలు, కుమ్మరి తదితర వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారందరికీ ఈ జగనన్న తోడు పథకం ఒక వరమని తెలిపారు. జిల్లాలో 16,541 మందికి బ్యాంకుల ద్వారా సుమారు రూ.18.21 కోట్ల రుణాలు అందించడం జరుగుతోందని, గతంలో జిల్లాలో 30,782 మంది చిరు వ్యాపారులకు సుమారు రూ. 70.71 లక్షలు వడ్డీ రీయంబర్స్‌మెంట్ అందించారని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, ఏపీఎం సుబ్బారెడ్డి, మెప్మా అధికారి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంతో ప్రయోజనం



నా పేరు అమ్ములు. నేను యోగి మల్లవరంలో నివసిస్తున్నాను. మహాలక్ష్మి సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. నేను ఫ్యాన్సీ షాపు నడుపుతూ.. వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఈ పథకం ద్వారా రూ.10 వేలు లబ్ధి పొందాను. చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు జగనన్న తోడు పథకం ద్వారా వచ్చిన సొమ్ము ఫ్యాన్సీ షాపులో వస్తువుల కొనుగోలుకు ఉపయోగించుకుంటూ వ్యాపారాన్ని విస్తరిస్తున్నాను. చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకం ఎంతో ప్రయోజనంగా ఉంది.

-అమ్ములు, లబ్ధిదారు

ఆధ్యాత్మిక నగరిలో హాకీ పండుగ



సమావేశంలో మాట్లాడుతున్న మోహిత్‌రెడ్డి

- తిరుపతి వేదికగా 14వ హాకీ చాంపియన్ షిప్- 2024 పోటీలు
- ముఖ్య అతిథిగా తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరు

తిరుపతి రూరల్: ఎస్వీయూ క్రీడా మైదానం వేదికగా 14వ హాకీ ఆంధ్రప్రదేశ్ జూనియర్ మెన్ రాష్ట్ర స్థాయి హాకీ ఛాంపియన్ షిప్ – 2024 పోటీలు గురువారం వేడుకగా ప్రారంభమయ్యాయి. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ఈ పోటీలను ప్రారంభించారు. ఈ క్రీడల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆ తరువాత కాసేపు క్రీడాకారులతో హాకీ ఆడి, చిన్నప్పటి జ్ఞాపకాలను చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి హాకీ పోటీల నిర్వహణకు రూ.50 వేలు నగదును నిర్వాహకులు, జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదిత్య రెడ్డి, ఉపాధ్యక్షులు శశిధర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ మన జాతీయ క్రీడలో బాగా రాణించి, గొప్ప గుర్తింపు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి హాకీ ఛాంపియన్ షిప్ – 2024 పోటీల్లో జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొంటుండడం గొప్ప విషయమన్నారు. చంద్రగిరి నియోజకవర్గం నుంచి రజినీ అంతర్జాతీయ స్థాయిలో హాకీ గోల్ కీపర్‌గా, రాణిస్తుండటం గర్వకారణంగా ఉందన్నారు. జిల్లా, రాష్ట్రం పేరును ఇనుమడింప చేసేలా ఆత్మవిశ్వాసంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజు మాట్లాడుతూ తిరు పతి వేదికగా నిర్వహించే హాకీ టోర్నీలకు జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. హాకీ క్రీడపై యువత అమితాసక్తి కనబరుస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు హాకీ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. హాకీ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి థామస్ పీటర్, పీఈటీ అండ్ పీడీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొందు సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

చిరకాల స్వప్నం సాకారం



లబ్ధిదారుకు పట్టాను అందిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

- 22ఏ జాబితా నుంచి తొలగించిన వాటికి కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లు
- సాక్షి సంతకాలు చేసిన డిప్యూటీ మేయర్ అభినయ్

తిరుపతి అర్బన్: ఇళ్ల స్థలాలు, ఇళ్లకు హక్కు పొందడం తిరుపతిలోని పేదల చిరకాల స్వప్నంగా ఉండేదని, అది నేడు సాకారమైందని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పేర్కొన్నారు. దశాబ్దాల సమస్యకు పరిష్కారం లేకపోవడంతో అంతా బిక్కు బిక్కుమని చూస్తున్న తరుణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పట్టుదలతో సమస్యకు పరిష్కారం చూపించారన్నారు. తిరుపతిలో 22ఏ జాబితా నుంచి తొలగించిన భూములకు రెండు నెలలుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో గురువారం తిరుపతిలో పలువురు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని చెప్పారు. వారికి అండగా ఉంటూ రిజిస్ట్రేషన్లకు సాక్షి సంతకాలు చేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తిరుపతిలోని 22ఏ జాబితా సమస్యను పరిష్కరించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, వాటికి పరిష్కారించడంతో పేదలంతా ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డితో పాటు పలువురు రెవెన్యూ అధికారులు పూర్తి సహకారం అందించారని తెలిపారు. దీంతో వేల కుటుంబాల సమస్యకు పరిష్కారం లభించిందని చెప్పారు. తిరుపతి నగరంలోని 25 ప్రాంతాలకు చెందిన వారి భూములు, ఇళ్ల పట్టాలు, ఇళ్లు 22ఏ జాబితాలో ఉండేవన్నారు. ప్రధానంగా సప్తగిరి నగర్, మధురానగర్, సుభాష్‌నగర్, సుబ్బారెడ్డినగర్, తాతయ్యగుంట, గోవిందనగర్, శివజ్యోతి నగర్, శింగాలగుంట, ఆర్‌ఎస్ గార్డెన్స్, కేవీ లే అవుట్, నెహ్రూనగర్, బొమ్మగుంట, ఎల్‌కే రోడ్డు, ఎన్‌సీబీ కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన వారంతా ఉన్నారని చెప్పారు. రెండు నెలలుగా ఒక్కొక్కరు తమ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారన్నారు. వారికితోడుగా తమతోపాటు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు అండగా ఉన్నారని తెలిపారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



చిత్ర ప్రదర్శనను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే ఆదిమూలం, ఎమ్మెల్సీ సిపాయి

తిరుపతి అర్బన్: బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ ఛాయాచిత్రాలను గురువారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన విజయవాడలోని స్వరాజ్ మైదానంలో రూ.403 కోట్లతో 18.18 ఎకరాల్లో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని వెల్లడించారు. సామాజిక సమతా సంకల్ప (జన్ భాగీదారి) కార్యక్రమాలను జిల్లాలో జనవరి 4 నుంచి 19వ తేదీ వరకు చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అంబేడ్కర్ ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 19వ తేదీ వరకు ఉంటుందన్నారు. డీఆర్వో పెంచలకిషోర్, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, డివిజన్ అధికారి ఈశ్వరమ్మ, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి పాల్గొన్నారు.

వదినను హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

తిరుపతి లీగల్: వదినను హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు, రూ.3000 జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ గురువారం తీర్పు చెప్పారు. జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ఏపీపీ ఎస్.వెంకటరమణ, కోర్టు మానిటరింగ్ అధికారి మునిరత్నం నాయుడు, కోర్టు కానిస్టేబుల్ శేఖర్ కథనం మేరకు.. తిరుపతి ఎస్వీయూనివర్సిటీ పరిపాలన భవనంలో పి.శివశంకర్ అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించేవారు. ఆయన తన భార్య సుధారాణితో కలిసి ఎస్వీయూ క్యాంపస్, ప్రకాష్‌నగర్‌లోని క్వార్టర్స్ నంబర్ –17లో నివసించేవారు. 2014 డిసెంబర్ 19వ తేదీన ఉదయం 8.30 గంటలకు ఆయన విధులకు వెళ్లారు. ఆయన కుమారుడు కిషోర్ స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం శివశంకర్ భోజనానికి ఇంటికి వచ్చి తలుపు కొట్టగా అతని భార్య సుధారాణి తలుపు తీయలేదు. దీంతో అతను ఇంటి వెనుక ఉన్న తలుపు తీసుకొని ఇంట్లోకొచ్చి చూడగా ఆమె కనిపించలేదు. దీంతో అతను తన కుమారుడు కిషోర్‌కు ఫోన్ చేసి విషయం తెలపగా అతను ఇంటికి వచ్చాడు. ఇద్దరూ కలిసి ఇంటి మొదటి అంతస్తులోకి వెళ్లి చూడగా సుధారణి రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గుర్తించారు. కిషోర్ తన తాత నెట్టికల్లుకు ఫోన్ ద్వారా తెలిపాడు. అనంతరం అందరూ కలిసి సుధారాణిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



మురళీకృష్ణ

ఆమెకు చెందిన 67.5 గ్రా ముల బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీనిపై సుధారాణి తండ్రి నెట్టికల్ ఎస్వీయూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐలు పి.రామకృష్ణ, ఎం.శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేశారు. దర్యాప్తులో శివశంకర్ తమ్ముడు నిందితుడు మురళీకృష్ణ హత్య చేసినట్లు గుర్తించారు. తిరుపతి చింతకాయల వీధిలోని పిత్రార్జితంగా వచ్చిన ఆస్తిని తన పేరున రాసివ్వకుండా, తనకు డబ్బులు ఇవ్వనందుకే తన వదిన సుధారాణిని హత్య చేసినట్టు పోలీసుల ఎదుట మురళీకృష్ణ నేరం ఒప్పుకున్నాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

సారా తయారీలో తెలుగు తమ్ముళ్లు

చంద్రగిరి: మండలకేంద్రంలో తెలుగు తమ్ముళ్లు సరికొత్త వ్యాపారానికి తెరతీశారు. టీడీపీ నేత పులివర్తి నాని అనుచరులు సారా తయారీలో తలమునకలై ఉన్నారు. గుట్టుచప్పుడు కాకుండా సారా తయారు చేసి మండల వ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) అధికారులు గుర్తించారు. చంద్రగిరి మండలం, కొటాలలో సారా తయారీ చేస్తున్నారనే సమాచారంతో గురువారం ఎస్‌ఈబీ సీఐ లీలాకుమారి ఆధ్వర్యంలో దాడులు చేశారు. కొటాల ఎస్టీ కాలనీకి సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా ఊటను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో కొటాల పంచాయతీకి చెందిన టీడీపీ నేత పులివర్తి నాని అనుచరుడు చెంగయ్యతో పాటు మరో ముగ్గురున్నట్టు ఎస్‌ఈబీ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో సారాతో పాటు చెంగయ్యను చంద్రగిరి ఎస్‌ఈబీ కార్యాలయానికి తరలించారు. తమదైన శైలిలో విచారణ కొనసాగిస్తున్నారు. ఇందులో చెంగయ్యతో పాటు మరికొంత మంది తెలుగు తమ్ముళ్లు ఉన్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. అంతేకాకుండా నిందితులు గతకొంత కాలంగా ఇక్కడి నుంచి తయారు చేస్తున్న సారాను మండల వ్యాప్తంగా విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. పట్టుబడిన నిందితుడి కుమారుడు కూ డా ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుల్లో నిందితుడిగా జైలుశిక్ష అనుభవించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



పాకాల: రైలు ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పాలినేనివారిపల్లె సమీపంలో గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. గుంతకల్–తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఢీకొని గుర్తు తెలియని సుమారు 70 సంవత్సరాల వృద్ధుడు మృతి చెందాడు. మృతుడు తెలుపురంగు షర్టు, ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడు ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడా? లేక ఉద్దేశపూర్వకంగా రైలు కింద పడ్డాడా అన్న విషయం తెలియాల్సి ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. చిత్తూరు సీఆర్పీ రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి సంబంధించిన వారు పాకాల రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అందుబాటులో ఎరువులు

రేణిగుంట: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులతోపాటుగా పెస్టిసైడ్స్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు అన్నారు. తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలి, చిట్టత్తూరు రైతుభరోసా కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో ఈ రబీ సీజన్‌లో 11,250 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా అందులో 19,200 ఎకరాల్లో రైతులు వరినాట్లు వేసినట్లు ఏఓ సురేంద్రరెడ్డి తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతు భరోసా కేంద్రాలకు 1,300 మెట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేయగా ఇప్పటి వరకు వెయ్యి మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయించినట్లు పేర్కొన్నారు. ఏడీఏ (ప్లాంట్ ప్రొటెక్షన్) ధనుంజయరెడ్డి, ఏడీఏ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.